



# హాసానికి ప్రతిఫలము

ఆరోజు రాత్రి భవానీశంకర్ గౌరవార్థము అతని ఆంతరంగిక స్నేహితులు నల్గురూ విందు ఏర్పాటు చేశారు. ఈ నల్గురిలోనూ ఉన్నవాడైన కామేశము యింటివద్ద విందు ఏర్పాటు జరిగింది. పేరుకు స్నేహితులు నలుగురు యిచ్చినా విందుకైన ఖర్చంతా కామేశమే భరించాడు. ఆహూతులు కూడ అయిదుగురే. భవానీ శంకర్ అవివాహితుడు కనుక మిగిలినవారు తమ శ్రీమతులను వెంట తీసుకురాలేదు.

భవానీ శంకర్ వారము రోజుల క్రితమే అమెరికానుంచి, ఇంజనీరింగులో ఉన్నత విద్యాభ్యాసము ముగించుకు వచ్చాడు. చాలా రోజుల తరువాత స్నేహితులు కల్సుకోవడము వలన, పిచ్చాపాటి కులాసాగా మాట్లాడుకోవచ్చుననే ఉద్దేశ్యంతో విందుకు ఇతరులనెవరినీ ఆహ్వానించలేదు.

అయిదుగురూ పరిహాసాలతోటి ఛలోక్తులు విసురుకుంటూ మాట్లాడుతున్నారు. ఎనిమిదిగంటలు అయ్యేసరికి సప్లయరు

వచ్చి అంతా రెడీ అయిందని చెప్పాడు. వెంటనే భోజనాల గదిలోకివెళ్ళి నిర్ణీత స్థానములలో కూర్చున్నారు. భోజనము జరుగుతున్నంత సేపు పిచ్చాపాటి మాట్లాడుతూనే ఉన్నారు.

"ఇవాళ 'హిందూ' మేట్రిమోని యల్సులో ఒక విచిత్రమైన ప్రకటన పడింది. చూశారా?'' అన్నాడు హఠాత్తుగా శేషగిరి.

"అవును నేనూ చూశాను" అన్నాడు కామేశము.

''ఏడ్చారులేవోయ్. చూశాము, చూశాము అంటారేగాని అదేమిటో చెప్పరే?'' కస్సుమన్నాడు రెడ్డి. రెడ్డికి సంభాషణ మధ్యలో సస్పెన్సు చెడ్డ చిరాకు.

"కాస్త ఆగరా నాయనా...చెప్పకేం చేస్తారు?'' అన్నాడు శాస్త్రి. శాంతమే భూషణము అంటాడు శాస్త్రి.

"ఎం. యస్‌సి. చదివి, లెక్చరర్‌గా జాబ్ చేస్తున్న స్త్రీకి వరుడు కావాలట..." గిరి మాట ముగియకముందే రెడ్డి అనేశాడు :

"అయితే అంత చదివిన స్త్రీ పెళ్ళి చేసుకోవడం మహాపరాధమనా నీ ఉద్దేశ్యం?'' అని.

"పూర్తిగా విన్న తరువాత మాట్లాడవోయ్ మహానుభావా!'' అన్నాడు కామేశం రెడ్డిని వారిస్తూ.

గిరి తిరిగి చెప్పసాగాడు.

''ఆమె మూడు వందలకు పైన డ్రా చేస్తుందట. కొద్దిపాటి స్థిరచరాస్థులు ఉన్నవట. కావలసిన వరుడు_ఆస్థి లేనటువంటి, తక్కువ చదువు కల వాడట. మెట్రిక్యులేషను పాసయి నిరుద్యోగిగా ఉంటే చాలట. మాట సంస్కారము గలిగి, ఇంటి వ్యవహారములు చూడ గలిగి ఉండాలట. ముఖ్యముగా ఆమె ఎక్కడుంటే అక్కడే ఉండడానికి యిష్టపడాలట."

"చాలా విచిత్రంగా ఉందే?'' ఆశ్చర్యపోతూ అన్నాడు రెడ్డి.

"అందుకేగదోయ్ చెప్పింది?'' అన్నాడు కామేశం.

''మనకు అయిపోయిందిగా ఆ పుణ్యకర్మ...ఒరేయ్ భవానీ! నువ్వు చూసుకోరా ఛాన్సు!'' అన్నాడు శాస్త్రి.

భవానీ చిఱునవ్వు నవ్వి "నేను డబుల్ గ్రాడ్యుయేటును గదరా శాస్త్రీ?" అన్నాడు.

"ఏడ్చావుగాని ఎస్సెల్సీ సర్టిఫికెట్‌తో అప్లయి చెయ్యి" కామేశం సలహా యిచ్చాడు.

"నువ్వు జాబ్‌లో జేరడానికి ఎన్ని రోజులు పైముంది? ఎక్కడ జేరాలి?" ప్రశ్నించాడు గిరి.

"ఇంకా నెల ఉందిలే...ఎక్కడ

జేరవలసిందీ యింకా సెటిల్ కాలేదు" అన్నాడు భవానీ.

"అయితే యింకేం...ఈ లోపున అంతా అయిపోతుంది కూడా" అన్నాడు శాస్త్రి.

"అప్పుడే గాలిమేడలు కడతా వెందుకు, అంతా సక్సెస్ అయినట్లు ?" అన్నాడు రెడ్డి.

"ఇంకా అనుమానం ఎందుకు ?... భవానీ వెళ్ళడం ఇంటర్వ్యూలో ఫెయిలు అవడమూనా ?" అసంభవం అన్నట్లు అన్నాడు కామేశం.

"ఇంతకీ ఆ ఎడ్వర్టైజుమెంటు ఏదో నాకు చూపించండిరా !" అన్నాడు భవానీ నవ్వుతూ.

"అప్పుడే వీడిలో విరహరాగాలాపన ప్రారంభమయింది రోయ్ !" అన్నాడు శాస్త్రి. అందరూ గొల్లున నవ్వారు.

"పెళ్ళినాటికి మే ము జ్ఞాపకం వుంటామా ?" అన్నాడు గిరి.

"ఆ విషయంలో నేను గ్యారంటీ యివ్వలేను" అన్నాడు భవానీ. మరల అందరూ నవ్వారు.

భవానీ శంకర్ అప్లై చేసిన వారము రోజులలోనే రిప్లై కూడ వచ్చేసింది. తిరుపతిలో ఫలానా తారీఖున, ఫలానా అడ్రెసులో కల్సుకోమని వధువైన సులోచన వద్దనుంచి వచ్చింది జాబు.

నల్గురు స్నేహితులూ కొట్లాడుకొంటూ నిర్ణయించిన వేషభాషలతో అనుకున్న రోజుకంటె రెండు రోజులు ముందే తిరుపతి బయలుదేరాడు భవానీ. అతని వేషంలో సగం బీదతనం, మిగిలిన సగం పల్లెటూరి తనమూ మూర్తీభవించినవి.

దిగువ తిరుపతి జేరిన భవానీ శంకర్ ఒక హోటలులో బసచేశాడు. రమ్మన్న సైముకు వారిచ్చిన అడ్రెసుకు వెళ్లాడు. పైజమా, లాల్చి, చేతిలో చిన్న సంచి, చేతికి చౌకబారు రిష్టువాచ్ : అతని వేషం.

అది లెక్చరర్సు క్వార్టర్సులో ఒక యిల్లు. ఇంటి నంబరు చూసుకొని కాంపౌండులోకి అడుగు పెట్టేసరికి ఒక స్త్రీ (పనిమనిషి కావచ్చు) ఆహ్వానించి వరండాలో ఉన్న బెంచి చూపించినది. అక్కడ తనవలెనే వచ్చినవారు యింకా అయిదుగు రున్నారు. తరువాత మరో నలుగురు వచ్చారు.

భవానీ శంకర్‌కంటె అందరి వేషధారణా మెరుగుగానే ఉంది. కాని అంతగా అందగాళ్ళు కారు వయస్సులో ముప్పై అయిదు లోపు, ఇరవై పైన ఉన్నారు. ప్రతి ఒక్కరి ముఖంలోనూ ఇతరుల యెడ అసూయ, కోపం తాండవిస్తున్నవి ఎవరితోనూ ఎవరూ మాట్లాడలేదు. కనీసం మాట్లాడటానికి ప్రయ

త్నించనైనా లేదు. వారి ప్రవర్తనకు చిన్నగా నవ్వుకున్నాడు భవానీ.

పదిన్నరకు యింటర్వ్యూ ప్రారంభమయింది. ముగ్గురు అవివాహితులైన యువతులు హాలులో కూర్చుని ఒక్కొక్కరిని పిల్చి ఏవో ప్రశ్నలు అడిగి పంపిస్తున్నారు. ఆ ప్రశ్నలు అడగడం కూడా చాలా విచిత్రంగా ఉంది. చివరిలో "తరువాత తెలియ జేస్తాము" అన్న జవాబు తీసుకొని ప్రతి అభ్యర్థీ తిరిగి వెళ్ళిపోతున్నాడు. అందరూ వెళ్ళిపోయారు. పన్నెండు గంట లయింది.

"...భవానీ శంకర్ గారూ..." తన పేరు పిలవగానే ఒకసారి లాల్చీ సవ రించుకొని హాలులో ప్రవేశించాడు భవానీ.

ముగ్గురు యువతులు సమాన వయస్కులు, అందకత్తెలు, ఠీవిగా కూర్చు న్నారు. ఎంతైనా క్లాసులో చూపే లెక్చరర్ దర్జా ఎక్కడికి పోతుంది ? వారికి ఎదురుగా ఒక ఖాళీ కుర్చీ ఉంది.

"కూర్చోండి...ఆలస్యమయినందుకు క్షమించాలి'' అన్నది ఒక స్త్రీ.

"దాని దేముందిలెండి...ఇంటర్వ్యూ అన్నప్పుడు చివరి అభ్యర్థికి ఆలస్యం కాదాఏమిటి ?" అంటూ కూర్చున్నాడు భవానీ.

''మీరు చాలా యింటర్వ్యూలకు హాజరయినట్లున్నారే ?" వేరొక స్త్రీ ప్రశ్న.

"అవునండి...ఏదైనా ఉద్యోగం వస్తుందనే ఆశతో దాదాపు యాభై ఇంటర్వ్యూలకైనా హాజరై ఉంటాను. అయితే తరువాత ఉండవలసినవి లేక పోవడం వలన ఏ ఉద్యోగమూ రాలేదు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాను'' అతని జవాబు.

''తరువాత ఉండవలసినవి అంటే ఏమిటి ?" ప్రశ్న.

"రికమెండేషను వగైరాలు" జవాబు.

"అయితే ఈ యింటర్వ్యూకు కూడా ఏమీ తీసుకురాలేదేం ?"

"ఇక్కడకూడా అవి పనిచేస్తవని తెలీదు...''

''కాబట్టి ఈ సీటు మీకు రాకపోతే?"

"పోనీండి...ఇంటర్వ్యూలో సెలెక్టు కాకపోతే బాధపడడం మానేశాను... కనీసం తిరుపతి వచ్చిన ఫలితమైనా దక్కకపోతుం దంటారా ?'' నెత్తి సవ రించుకుంటూ తిరిగి ప్రశ్నించాడు భవానీ.

ఆ ముప్వురు యువతులూ నవ్వకుండా ఉండలేకపోయారు.

"మీకు బంధువులు ఎవ రున్నారు?"

"ఎవరూ లేరు...ఏకాకిని..."

''అయితే యిప్పటివరకూ ఎట్లా జీవిస్తున్నారు ?''

"పిత్రార్జితం నాలుగెకరాల పొలం ఉంటే అది అమ్ముకుని తింటున్నాను. చివరి యకరం ఈఏడే అమ్మేశాను."



"మీ వయస్సు ఎక్కువగానే ఉంది. యిప్పటివరకూ ఎందుకని పెళ్ళి చేసుకో లేదు ?''

''ఉద్యోగం వచ్చేవరకు చేసుకో రాదని నిర్ణయించుకున్నాను.''

''అట్లాగయితే యిక్కడికి ఎందుకు వచ్చారు ?''

'ఇదీఒకఉద్యోగమే అనిపిస్తోందినాకు.'

ముగ్గురూ ఫక్కున నవ్వారు.

"మరి...మీ ఆస్తి అయిపోవచ్చింది కదా! అనంతరం జీవనాధారం ఏమిటి?"

"ఈ నెలలో ఉద్యోగమైనా వస్తుంది లేక దానికి సమానమైన వివాహమైనా జరుగుతుందని ఒక జ్యోతిష్కుడు చెప్పాడు."

"జ్యోతిష్యమంటే మీకు బాగా నమ్మకముందా?"

"జ్యోతిష్యానికి మన నమ్మకం, అపనమ్మకాలతో సంబంధ మేముంది? కేవలము జ్యోతిష్యంవలన జరుగబోయేది ఏమీ మారదుగదా!"

"ఎస్సెల్సీ మార్కులు బాగా వచ్చినవిగా. మీరు ఎందుకని పైకి చదువలేదు?"

"అది నా యిష్టం. అప్పటికి చాలనుకున్నాను. మానేశాను. నాకు చెప్పేవారు ఎవరూ లేరన్నానుగా?"

"మీకు వంట చేయడం వచ్చునా?"

"ఆఁ రోజూ నేనేగా వంట చేసుకునేది..పాడి పరిశ్రమకూడా చెయ్యగలను."

"మీరు యిక్కడికి ఎప్పుడు వచ్చారు?"

"మూడురోజులైంది."

"అప్పట్నుంచీ ఎక్కడుంటున్నారు?"

"హోటల్ పద్మ విలాస్‌లో రూం తీసుకున్నాను."

"మీరు బీదవారు అంటున్నారుగా; అంత క్లాసు హోటలులో ఎట్లా బస చెయ్యగలిగారు?"

"ముందుగా నాకు ఆ సంగతి తెలియదు. రిక్షావాడు తీసుకెళ్ళాడు. మూడు రోజులేగదా అని ఉండిపోయాను."

తరువాత ఆ ముగ్గురూ హైబ్రో యింగ్లీషులో రెండు నిమిషాలు మాట్లాడుకున్నారు. అదంతా అర్థం కానట్లు నటించాడు భవానీ.

"అయితే మీరు యిక్కడినుంచి వెళ్లేముందు ఏం చేస్తారు?"

"వెళ్ళినా ఉండినా ముందుగా కొండ మీదకు వెళ్ళి..." ఆ తరువాత చేతితో తల తట్టి చూపించాడు భవానీ.

"దేవుడంటే మీకు అంతగా భయం భక్తీ ఉన్నవా?"

"మొట్టమొదటిసారి తిరుపతి వచ్చిన హైందవు డెవరూ ఒట్టినే తిరిగి వెళ్ళడు."

"వివాహం ఖాయపరిచే పక్షాన మీరు కోరే హక్కులు ఏమిటి?"

"నాకు యిద్దరు ముగ్గురు స్నేహితులున్నారు. కనుక నా పేరున వచ్చిన ఉత్తరాలన్నీ చదవకుండా నాకు యిచ్చేయాలి. నా యిష్టమైతేనే వాటిని చూడాలి. అంతకంటే మరేమీ హక్కులు వద్దు...అన్నట్టు, తిండీ బట్టా యివ్వాలి. వంటమనిషిని మాన్పించెయ్యాలి."

చివరిమాటకు ముగ్గురూ నవ్వారు.

"మీరు వివాహానికి ఎన్నిరోజులలో తిరిగిరాగలరు ?"

"వివాహానికి అంగీకరించేపక్షంలో నేను అక్కడికి వెళ్ళవలసినపనిలేదు. పిలువవలసిన బంధువులూలేరు.''

"అయితే రెండు రోజులపాటు యిక్కడే ఉంటారా మీరు? మా నిర్ణయం తెలియపర్చుతాం.''

"క్షమించాలి. నా వద్ద డబ్బు తక్కువగా ఉంది. రేపే వెళ్ళిపోతాను.''

వారిలో ఒకామె రెండు పదిరూపాయల నోటులు తీసి అతనిముందుంచింది.

''ఇవి ఉపయోగించి యింకా రెండు రోజులు ఉండండి. రేపు సాయంత్రం మా నిర్ణయం తెలియపర్చుతాం.''

"థాంక్సు. నేను వెళ్ళగానే అప్పయినాచేసి మీకు డబ్బు పంపించేస్తాను." అని భవానీ వాటిని తీసుకున్నాడు.

"పంపకపోయినా ఫరవాలేదులెండి.. ఇంక మీ కేమైనా సందేహాలుంటే అడిగేయండి.''

"ఒకటి..మీ రెవరు ?...సులోచనగారెవరు ?"

"మేము ముగ్గురం" స్నేహితులం. లేడీస్ కాలేజీ లెక్చరర్సుం...ఈమె సులోచనాదేవిగారు'' అంటూ ఒకామె వేరొకామెను చూపించింది. ఆ సులోచన సిగ్గుతో కొద్దిగా తలవంచుకున్నది.

"సరే మీ రిక వెళ్ళవచ్చు. రేపు సాయంత్రం మర్చిపోయి ఎక్కడికైనా వెళ్ళేరు సుమా !... రూములోనే ఉండండి. మాలో ఎవరైనా వచ్చి ఫలితం తెలియజేస్తాం'' అన్నది మొదటి స్త్రీ.

''థాంక్సు. గుడ్ నూన్'' అని భవానీ బయటపడ్డాడు.

అతను వీధిలోకి వచ్చేసరికి తెరలుగా నవ్వులు వినిపించినవి.

మరునాడు చెప్పిన టైముకే సులోచన, మరొక స్త్రీ భవానీశంకర్ వద్దకు వచ్చారు. భవానీ వారిని రూములోకి ఆహ్వానించాడు.

"మా సులోచనను చూశారుగా; మీ అభిప్రాయం చెప్పండి'' అన్నది రెండవ స్త్రీ — రత్నకుమారి.

"నా అభిప్రాయం ఏమంత ముఖ్యమైంది కాదు. సులోచనగారి అభిప్రాయమే యింపార్టెంటు.'' అని సూటిగా చూశాడు భవానీ.

"మీతో వివాహానికి మా సులోచన అంగీకరించింది." నవ్వుతూ అన్నది రత్నకుమారి.

''ఓ మై గాడ్ !!...చాలా సంతోషం" అంటూ ఆనందం ప్రకటించాడు భవానీ.

''ఎక్కువ టైము లేదు. రేపే రిజిష్టరు మేరేజి జరగాలి. మంచిరోజు

కూడా...మా చెల్లితరపున ఎవరూ లేరు. కనుక మీ వైపునా ఎవరూ లేకపోయినా ఫరవాలేదు.'' అన్నది రత్నకుమారి.

"వెరీ గ్లాడ్. నేనూ అదే అనబో తున్నాను. నా అభిప్రాయం మీ రే చెప్పేశారు...కాని ఒక చిన్న సందేహం...''

"ఏమిటో అడిగేయండి?"

"ఏమీలేదు. మీవంటి విద్యావంతులు, గొప్ప ఉద్యోగస్తులు...నాబోటి అనా మకుడితో సాహచర్యం అంగీకరించ డం...నాకు అనుమానంగా ఉంది... ఇదంతా కలా? నిజమా? అని సందే హిస్తున్నాను.''

''వృధాగా అనుమానించకండి... త్వరలోనే మీకు అసలు కారణం తెలు స్తుంది'' అంటూ రత్నకుమారి గదంతా పరిశీలనగా చూసింది. రెండు సంచుల నిండా దుస్తులు, ఒక బెడ్డింగు మినహా మరేమీ లేవు. చివరికి ఆమె దృష్టిని ఒక గోల్డుఫ్లాక్ సిగరెట్ టిన్ను ఆకర్షించింది.

''మీరు స్మోక్ చేస్తారా?'' అని అడిగింది ఆమె.

''ఏదో కొంచెం అలవాటుంది లెండి...కొంపదీసి సులోచనగారికి— స్మోకింగ్ అంటే గిట్టదాండి?'' ఆందో ళనతో అడిగాడు.

సులోచన నవ్వి ఊరుకుంది.

"ఈమెకు అటువంటి పట్టింపులు లేవు లెండి...యికనుంచి మీరుకూడా అట్లాగే మెలగవలసి ఉంటుంది...కాని మీ బ్రాండ్ చాలా కాస్ట్లీ?'' అని సందేహం వెల్లడించింది రత్నకుమారి.

"రోజుకు రెండుమూడే కాబట్టి పెద్దగా ఖర్చు లేదులెండి...అయినా అవసర ముంటే బ్రాండ్ తగ్గించేస్తాను.''

''అబ్బే అంత అవసరం ఏమీ లేదు లెండి...కాని, మీరు ఉన్నత విద్యావంతు లైయుండి మమ్మల్ని మోసం చెయ్య డంలేదు కద?''

"చంపారు పొండి...మీ కా అను మానమే ఉంటే చెప్పండి. ఇంకో గంటలో ట్రైనుంది" అన్నాడు భవానీ.

''అబ్బే ఊరకనే అన్నాను. సీరి యస్‌గా తీసుకోకండి...రేపు పన్నెండు గంటలకే రిజిష్ట్రారు ఆఫీసుకు వెళ్లాలి. మీరు రెడీగా ఉండండి'' అన్నది రత్న కుమారి.

సులోచన తన హ్యాండ్ బ్యాగ్‌లోనుంచి రెండు వందల రూపాయలు తీసింది.

''మీరు రెడీమేడ్ షాపులో దుస్తులు తీసుకోండి. మిగిలింది ఖర్చులకు ఉంచ నియ్యండి" అని అవి యిచ్చింది సులోచన.

''థాంక్సు... మా ఫ్రెండ్సునుంచి టి. ఎం. ఓ. రప్పిద్దామనుకుంటున్నాను. నా కా శ్రమ తప్పించారు'' అంటూ అవి తీసుకున్నాడు భవానీ.



''ఇవ్వాళ నాగీతలో పుట్ పాత్ మీద నిద్రే రాసిపెట్టినట్టుంది.''

''ఇక మేము వస్తామండీ'' అని వారిద్దరూ వెళ్ళిపోయారు.

సులోచన రూపురేఖలు బాగుండుట వలన, గుణగణాలు మంచివి అని నమ్మడంవలన భవానీకి తప్పించుకోవాలనే ఆలోచనే రాకపోయింది.

మరునాడు అనుకున్న విధంగానే రిజిష్టరు మేరేజి జరిగిపోయింది. సులోచన స్నేహితురాళ్ళిద్దరు తప్ప మరెవరూ రాలేదు. ఆ రోజునే క్రొత్త దంపతులిద్దరూ తిరుమల వెళ్ళి దైవ దర్శనము చేసుకున్నారు. సులోచన ఎంత బ్రతిమలాడినా వినకుండా భవానీ తల నీలాలు దేవునికి అర్పితం చేశాడు.

మూడవ రోజున సులోచన ముఖ్యమయిన స్నేహితు లందరికీ టీ పార్టీ చేసింది. స్త్రీ పురుషులైన కాలేజి వుద్యోగులు దాదాపు యిరవైమంది పార్టీకి హాజరయ్యారు. సులోచన తన భర్తను అందరికీ పరిచయం చేసింది.

వచ్చిన వారిలో కొందరు అతి అమాయకంగా ఉన్న భవానీని ఆట పట్టించాలని చూశారు. కాని, సులోచన అటువంటివా రందరికీ భర్త తరఫున జవాబు లిచ్చింది.

కాని అప్పట్నుంచీ తోటి లెక్చరర్ల మధ్య సులోచన విలువ దిగజారిపోయింది. అందుకు పురికొల్పే సంఘటనలుకూడా కొన్ని జరిగినవి. ఆమె తనను పరోక్షంగా గేలిచేస్తున్న సంభాషణలు వినవలసి వచ్చింది. తన చర్య ఎంత అపహాస్యమునకు పాత్రమయిందో ఆమె యిప్పుడిప్పుడే గుర్తించసాగింది. భవానీ మాటలు, చేష్టలుకూడా ఆమెను

వేధించసాగినవి. తనను ఈ వివాహానికి ప్రోత్సహించిన స్నేహితులుకూడ తన్ను గురించి హీనంగా ప్రవర్తించేసరికి ఆమె మరీ నిర్వీర్యురాలై పోయింది.

భవానీ మొదట్లో తను వంటచేస్తానని, అవీ యివీ చెప్పినా సులోచన అంగీకరించక పోవడంవలన ఊరుకున్నాడు. అతని కిప్పుడు మూడే పనులు. చేతికి చిక్కిన నవలలు చదవడం, షికార్లు చేయడం, అవకాశం కలిగినప్పుడల్లా ఆమె మనస్సుకు గాయంకలిగేట్లు వ్యంగ్యంగా మాట్లాడటం. అవసరం అనుకున్నప్పుడు ఆమెను ఓదార్చడం.

క్రమంగా పెరిగిపోతున్న భవానీ ఖర్చులు చూసి సులోచన అదిరిపోయింది. రోజూ అతని సిగరెట్లకే మూడేసి రూపాయలు అవుతున్నవి. ఆమెకు వచ్చే జీతంలో సగం అతని ఖర్చు. ఆమె డబ్బు యిచ్చినా యివ్వకున్నా అతని ఖర్చు తగ్గడం లేదు. ఆమె యిస్తేగాని అతను డబ్బు తీసుకోడు. కాని అవసరము గమనించి ఆమె యిస్తుంది. ఒక నెలలో అతని ఖర్చు రెండు వందలు దాటి పోయింది. ఆమె ధైర్యము దిగజారి పోయింది. ఖర్చు తగ్గించుకోమని ఎప్పటి కప్పుడు చెబుదాం అనుకుంటూంది గాని ముఖతా చెప్పలేక పోయింది. తన ఖర్చులు మాత్రం చాలావరకు తగ్గించుకుంది. పెళ్ళి అయిన నాల్గు నెలల్లోనే ఆమె బ్యాంకునుంచి వెయ్యి రూపాయలు డ్రా చేయవలసి వచ్చింది.

క్రమంగా సులోచనలో మార్పు వచ్చింది. పూర్వపు అంత ఉత్సాహం లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచన, దిగులు, ఒక్కోసారి కంటతడి పెట్టుకోవడం. క్రమంగా మనిషి చిక్కిపో సాగింది. భవానీ యివన్నీ గమనించినా ఏమీ ఎరుగనట్లు సంచరిస్తున్నాడు.

ఒకరోజు సులోచన కాలేజినుంచి వచ్చేసరికి భవానీ బి. ఎ. వారి కెమిస్ట్రీ పుస్తకం చదువుతున్నాడు. సులోచన ఆశ్చర్యపోయింది.

''ఆ పుస్తకం మీకు అర్థమవుతున్నదా ?" అని అడిగింది సులోచన ఉత్సాహంగా.

''ఆఁ ...... నా కేమి తెలుస్తుంది ? ఊరకనే బొమ్మలు చూస్తున్నాను. అంతే" పెడసరంగా జవాబిచ్చాడు భవానీ.

"పోనీ మీరు ప్రైవేటుగా పి.యు.సి. కట్టగూడదుటండీ," అన్నది సులోచన.

"నేను యిప్పటికే అన్నిటికీ పెళ్లాం మీద ఆధారపడవలసి వచ్చింది. చదువులో కూడ ఆధారపడమంటావా ? ... అయినా మొద్దుమొహాన్ని నాకేం చదువు వస్తుంది ?'' అన్నాడు.

సులోచన హృదయం కలుక్కుమంది. ఏమీ మాట్లాడకుండా లోనికి వెళ్లి పోయింది. అప్పుడు ఆమె మరీ కృంగి

పోయినట్లు గమనించాడు. అతనికి జాలి కలిగింది. ఆమె వెనుకనే లోనికి వెళ్లాడు.

మంచంమీద పండుకొని దిండులో ముఖం పెట్టుకొని ఉన్నది సులోచన. ఆమె దుఃఖిస్తున్నదని గ్రహించాడు భవానీ. అతనిలో సానుభూతి పెల్లుబికింది. ఆమె తలమీద నిమురుతూ అన్నాడు:

"సులోచనా! ఇవాళ చాలా విచారంగా ఉన్నట్లున్నావేం?"

సులోచన మాట్లాడలేదు.

"నీ దిగులేమిటో నాకు తెలుసు. స్త్రీకి తనకంటె తక్కువ హోదాగల భర్త ఉంటే కలిగే కష్టనష్టాలే నువ్వు ఎదుర్కోవలసి వచ్చింది. ఆరోజున నువ్వు యివన్నీ ఆలోచించలేదు. నన్నుగురించి నేను అన్నీ ఆరోజునే చెప్పుకున్నాను... ఇటువంటి మూర్ఖుడిని పెళ్ళాడానేమా అని యిప్పుడు చింతించితే ఫలిత మేమిటి?... పోనీ నా దారిన నేను వెళ్ళిపోతే నీ మనస్సుకు శాంతి కలుగు..." భవానీ మాటలు పూర్తికాకముందే సులోచన తటాలున లేచి తన చేతితో అతని నోరు మూసేసింది. ఆమె కన్నులలో నీరు చిప్పిల్లింది.

"అటువంటి మాటలు ఇకనుంచి ఎప్పుడూ అనబోకండి" అంది సులోచన గద్గదస్వరంతో.

"అదికాదు సులోచనా! నేను చెప్పేది..."

"మీరేమీ చెప్పవద్దులెండి......ఇక మీదట అట్లా అంటే నామీద వట్టే." అని కళ్ళు తుడుచుకొని పెరట్లోకి వెళ్ళిపోయింది సులోచన. భవానీ మెల్లగా నిట్టూర్చి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆరోజు సులోచనకు అంత దుఃఖం కలుగుటకు కారణం లేకపోలేదు. ఆనాడు ఆమెను ఉత్సాహపరచి, ప్రోత్సహించిన స్నేహితులే ఈనాడు తనను పరోక్షముగా ఈసడించివేశారు. ఆ మధ్యాహ్నం తను చాటుగా ఉన్నప్పుడు వారు తన్ను గురించి మాట్లాడుతూ నవ్వుతూంటే విన్నది.

"మనము ఎంతగా చెబుతున్నా వినకుండా సులోచన ఏమీ తెలియని ఓ మొద్దును కట్టుకుంది. చూశారా యిప్పుడు ఎట్లా అనుభవిస్తోందో. కాస్తంత ఎఱ్ఱగా బుఱ్ఱగా ఉండగానే సరా? కొంచెమన్నా చదువూ సంస్కారం ఉండనక్కర్లా?" అన్నది రత్నకుమారి. ఆమెకు ఈమధ్య ఒక ఐ.ఏ.ఎస్. ఆఫీసరుతో మేరేజి సెటిల్ అయింది.

"అవునవును. ఏదో పంతానికిపోయి క్రొత్త మార్గం చూపిస్తానని ఉబలాట పడిందిగా, అనుభవిస్తోంది. ఈమె సంపాదనంతా కలసి వాడి సిగరెట్లకే చాలడంలేదట" అన్నది రెండవ స్నేహితురాలు. ఆమెకు రెండు నెలల

క్రితమే ఓ ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసరుతో వివాహం అయిపోయింది.

"కాకేమిటండి...పిల్లకాకి కేంతెలుసు ఉండేలు దెబ్బ అన్నారు పెద్దలు ఊరక నేనా?...పెళ్ళి అంటే ఎంత ఆలోచన, సాలోచన ఉండాలి. చెప్పేవాళ్ళు ఎవరూ లేకపోబట్టి అట్లా తెగించిపోయింది. తాను ఒక నిరుద్యోగి పురుషుని పోషించి లోకానికి దారి చూపిస్తా నన్నదిగా. చూప నీయండి చూద్దాము...'' అన్నది వేరొక ఆమె. ఆమె భర్త పి. హెచ్‌డి, లెక్చరరు.

"చూపిస్తోందిగా విషాదాంకము. రక్తికట్టుంది కూడా...'' తరువాత వారి సంభాషణ వినలేకపోయింది సులోచన. భవానీకూడ తననుతాను, మూర్ఖుడనడం ఆమెకు మరింత బాధ కలిగించింది. కాని యిప్పుడు తాను చెయ్యగలిగిం దేమిటి?

సులోచన ఆర్థికంగా యిబ్బంది పడడం గమనించి భవానీ ఆమె యిచ్చే డబ్బు నిరాకరించ సాగాడు. డబ్బేమీ తీసుకొనకపోయినా అతని ఖర్చుకు ఏమీలోటు లేకపోవడం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. అడిగితే క్షణాని కో మాటచెబుతాడు భవానీ. అందు వలన అడగడం కూడా మానేసింది.

ఒక రోజు సాయంత్రం భవానీ బజారునుంచి తిరిగి వచ్చేసరికి సులోచన గదిలోనుంచి సంభాషణ వినవచ్చింది. ఆ రోజున తన స్నేహితురాలు ఒకామె మద్రాసునుంచి వస్తుందని సులోచన చెప్పినమాట అతనికి జ్ఞప్తికి వచ్చింది. సంభాషణ కూడ తననుగురించే అవడం వలన నిశ్శబ్దంగా వినసాగాడు.

"అయితే నువ్వు ఏ ప్రాబ్లెంమీద యిటువంటి భర్తను ఎన్నుకున్నావు?" అంటున్నది స్నేహితురాలు.

"లత, రత్నల అభిప్రాయానికి నేను వ్యతిరేకంచేసి చూపించా లనుకున్నాను. పురుషుడు సంపాదించి స్త్రీని ఎట్లా పోషిస్తున్నాడో, అట్లే సంపాదన పరు రాలైన స్త్రీ భర్తను పోషించగలదని భార్యకంటే భర్త అర్హతలు ఎక్కువగా ఉండకపోయినా ఫరవాలేదని, అధికార దర్పం చూపించకపోతే సంసారం సాఫీగా జరిగిపోగలదని నిరూపించా లనుకున్నాను....రత్న నా అభి ప్రాయం తప్పని వాదించింది. సమాజం దృష్టిలో స్త్రీ ఎంతటి ఉన్నతు రాలైనా, భర్తకంటె తక్కువ స్థానములో ఉండటమే ఉత్తమమని లత అన్నది.'' అన్నది సులోచన.

"నాకూ వారు చెప్పిందే సబబు అనిపిస్తోంది. నువ్వు పొరపాటు పడి నట్లున్నావు సులోచనా.''

"నేనేమీ పొరపడలేదు సుశీ! ఇప్పటికీ నా అభిప్రాయం తప్పని నేను అంగీకరించను.'' ఆవేశంగా అన్నది సులోచన.



"హాలో! ఫైర్ యింజన్ పంపించండి. ఇంటో నిప్పంటుకుపోతుంది."

"మరి ఎందుకని యింత విచారంగా ఉన్నావు? నీ భర్త నిన్ను హింసిస్తున్నాడా? లేక అతని ప్రవర్తన మంచిదికాదా?"

"అదేమీ కాదు. నా తలవ్రాత. ఆనాడు నన్ను ప్రోత్సహించిన వారే ఈనాడు పరోక్షంగా సాధిస్తున్నారు....ఆయన ఖర్చు - పిల్ల జమీందారుఖర్చు. ప్రతికానీ నేనే యివ్వాలి. యివ్వకపోయినా ఖర్చు జరుగుతూనే ఉంటుంది, అంత డబ్బు ఎక్కడినుంచివస్తూందో తెలియదు. నేను యిస్తే నా జీతమంతా అతని ఖర్చులకే చాలదు."

"అదా నీ దిగులుకు కారణం?"

"కాదు. కొందఱు స్నేహితుల ప్రవర్తనే నాకు బాధ కలిగిస్తోంది. ముఖ్యంగా...ఆయన్ని చదువుకోమంటే నిరాకరించారు. నా ముందు తమను హీన పర్చుకుంటారు. వారుకూడా పరాయి వారితో కలసి నన్ను సాధించదలచారా అనిపిస్తోంది నాకు."

"నీ జీవితం సుఖంగా జరుగకుంటే డైవోర్స్ కోరరాదూ?"

"సుశీ?" ఆవేశముగా అరచి, తిరిగి అన్నది సులోచన: "ఎప్పుడూ యిటువంటి సలహాయివ్వకు..సరైన హైందవ స్త్రీకి జీవితంలో ఒక్కరే భర్త... అతనే నాకు సర్వస్వం."

"అయితే నవ్వుతూ అనుభవించక విచారం దేనికి?"

''అందుకే ప్రయత్నిస్తున్నాను సుశీ!'

ఒక నిమిషం నిశ్శబ్దం.

''సులో! నువ్వు చెప్పినవన్నీ కన్సాలి డేట్ చేసి ఆలోచిస్తే ఆయన ఉన్నత విద్యావంతుడేమో అనిపిస్తోంది.''

''మొదట్లో నేనూ అట్లాగే అనుకున్నాను. కాదు...కాని నాగరికమైన వ్యక్తి...వారు వచ్చేవేళయింది చూస్తావుగా! పద'' అని సంభాషణ ముగించింది సులోచన.

భవానీ అప్పుడే వచ్చినట్లు నటిస్తూ లోన ప్రవేశించాడు. సులోచన స్నేహితురాలిని పరిచయం చేసింది. నమస్కార ప్రతి నమస్కారాలు అయిన వెనుక ముచ్చటగా మూడు ముక్కలే మాట్లాడి తన గదిలోకి వెళ్ళిపోయాడు భవానీ. సుశీల తెల్లబోయింది అతని ప్రవర్తనకు. తరువాత మూడవనాడే ఆమె మద్రాసు వెళ్ళిపోయింది.

భవానీ శంకర్ తిరుపతి వచ్చి ఆరు నెలలు దాటిపోయింది. అతను ఉన్నత విద్యావంతుడు కాడని సులోచన దృఢ నిర్ణయానికి వచ్చేసింది. అయితే వెనుకటివలే బాధపడడం ఇతరులమాటలు ఖాతరుచెయ్యడం మానేసింది సులోచన. ఆమె సంసారం సాఫీగానే జరిగిపోతోంది.

వేసంగి శలవులు. కాలేజీ లేదు. ఆ మధ్యాహ్నం సులోచన హాలులో ఈజీ ఛైరులో కూర్చుని బి. ఎ. పేపర్లు దిద్దుతున్నది. భవానీ తన గదిలో నిద్రిస్తున్నాడు.

''టెలిగ్రామ్ సార్!'' అంటూ వచ్చిన పోష్టుమన్ సులోచనకు ఒక ఎర్రటి కవరు యిచ్చాడు. అది తన కేరాఫ్‌లో భవానీశంకర్ పేరునవచ్చింది. ఆమె ఒక క్షణం తటపటాయించి కవరుచించింది. గబగబా రెండుసార్లు... మూడుసార్లు చదివింది. ఆమెకు పట్టరాని ఆనందం కలిగింది. అది సెంట్రల్ గవర్నమెంటు నుంచి వచ్చింది.

సులోచన ఒళ్లుతెలియని ఆనందంతో వెళ్లి భవానీని తట్టి లేపింది.

''ఏమిటి సులో..నన్ను కాస్సేపు కూడా నిద్రపోనియ్యవు" అంటూ కళ్లు తెరవకుండానే విసుక్కున్నాడు భవానీ. సులోచన అతని విసుగుదల ఖాతరు చెయ్యకుండా మరల కుదిపి అన్నది:

''మీరు నన్ను పూర్తిగా మోసం చేశారు'' అని.

''నాకు ఎవర్నీ మోసం చెయ్యడం తెలీదు. కాస్సేపు పడుకోనియ్యి. నీకు పుణ్యముంటుంది.'' అంటూ మరో ప్రక్కకు ఒత్తిగిల్లాడు భవానీ.

''అవును పాపం! నోటిలో వ్రేలుంచినా కొరకలేని అమాయకులుగదూ... ఏమండీ, మీరు ఇంజనీరింగ్‌లో డబుల్ గ్రాడ్యుయేటులని తెలిసిందే!''

భవానీ ఆశ్చర్యంగా కళ్లువిప్పి చూశాడు. సులోచనముఖంలో సంతోషం, కొంటెతనం మేళవించిఉన్నవి.

''ఎవరు చెప్పారు నీకు?''

"ఎవరైతేనేమి నాకు; తెల్పింది నిజమా! అబద్ధమా?'' అని రెట్టించింది సులోచన. భవానీ చిఱునవ్వు నవ్వాడు.

''అయితే ఎవరో నీకు మంచిటోకరా ఇచ్చారన్నమాట." అన్నాడు భవానీ.

"కాదు. ఇంతకాలం మీరే నాకు టోకరా యిచ్చారు. ఇంతకంటె ప్రూఫ్ ఏమి కావాలి?'' అంటూ టెలిగ్రామ్ చూపించింది సులోచన.

"లీవ్ విల్ నాట్ బి ఎల్లౌడ్. ఇమ్మీడియట్‌లీ జాయిన్ డ్యూటీ యాజ్ అసిస్టెంట్ చీఫ్ ఇంజనీర్ ఎట్ భోపాల్ హెవీ ఎలెక్ట్రికల్స్ ప్రాజెక్టు" అని చదివాడు భవానీ. "ఇది ఎవరిదో, పొరపాటున నాకు వచ్చింది. అంతే'' అనేశాడు చివరికి.

"అసంభవం, అడ్రెసు క్లియర్‌గానే ఉంది... మొదట్నుంచీ మీరు నన్ను మోసగిస్తున్నారనే అనుమానిస్తున్నాను. నిజంగా మీరు నా ముఖంలోకి చూసి చెప్పండి. మీరు డబుల్ గ్రాడ్యుయేటు కారా?'' సూటిగా భవానీముఖంలోకి చూస్తూ ప్రశ్నించింది సులోచన. భవానీ చిఱునవ్వు నవ్వాడు.

"...ఆల్సో ఫారిన్ రిటరండ్'' అన్నాడు యిక తప్పనిసరి అయినట్లు నవ్వుతూ.

''అబ్బ – మోసముచేసి నన్ను ఎంత బాధపెట్టారండీ!'' అతని హృదయంలో ముఖం దాచుకుంటూ అంది సులోచన.

"నువ్వు చేయబోయింది మాత్రం మోసంకాదా!. నీ ఆదర్శానికి ఒక పురుషుని ఆటబొమ్మగా ఉపయోగించుకో దలచావు... మోసానికి ప్రతిఫలం మోసమే సులో..'' అంటూ ఆమె ముంగురులు సవరించాడు భవానీ.

"టంగ్'' మని గోడగడియారం ఒకటి కొట్టింది.

